ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌ చంద్రయ్యహట్స్‌లో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సీతారామాంజనేయ, గణపతి విగ్రహాలకు గవ్యాంత పూజ, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, పర్యగ్నికరణ, గ్రామప్రదక్షిణ, స్నపనం మూలమంత్రహోమాలు నిర్వహించారు. శుక్రవారం దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే



సాక్షి,సిటీబ్యూరో: చింతలకుంటలోని నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సైంటిస్ట్‌ సంజయ్‌ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరు శ్రద్ధగా విద్యను నేర్చుకుంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ప్రైమరీ నుంచి హైస్కూల్‌కు వెళ్లబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్‌, ఆర్‌ఐ రవిప్రసాద్‌, కోఆర్డినేటర్‌ గాయత్రి, మహేశ్వరీ, మీనా, ప్రిన్సిపాల్‌ రాజరాజేశ్వరి దేవి, ఏఓ ఫణి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నాలాల్లో పూడిక తీయాలి

సైదాబాద్‌: నాలాల్లోని పూడికను ఎప్పటికప్పుడు తీయాలని సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి శంకేశ్వరబజార్‌లోని నాలా పొంగి బస్తీలోకి నీళ్లు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్‌ బుధవారం శంకేశ్వరబజార్‌ చౌరస్తాలోని నాలాను పరిశీలించి జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పూడికతీత పనులు చేయించారు. పనులకు అడ్డంకులు ఎదురవ్వకుండా ట్రాన్స్‌కో సిబ్బందితో అక్కడి చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శంకేశ్వరబజార్‌ బస్తీకి వరద ముంపు సమస్య శాశ్వతంగా తొలగిపోయేలా అధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్పొరేటర్‌ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజ్‌కుమార్‌, చంద్రయ్య, నాగరాజు, కిషోర్‌ ఉన్నారు.


బందగి ఉర్సు ఉత్సవాలు విజయవంతం



దర్గాపై ఛాదర్‌ సమర్పిస్తున్న దృశ్యం

సాక్షి,సిటీ బ్యూరో: చరిత్రాత్మక హజ్రత్‌ సయ్యద్‌ షా అబుల్‌ ఫత్తే బందగి బాద్‌షా ఖాద్రీ రహ ముతుల్లాలేహ్‌ దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిసినట్లు సజ్జాద్‌ఏ నషీన్‌ ముతావల్లి బందగీ రియాజ్‌ ఖాద్రీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాల్కొండలో రెండుం రోజులు పాటు ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. తొలి రోజు దర్గాకు గుసులే షరీఫ్‌, మహిఫిలే నాత్‌, తిలావతే ఖురాన్‌ పఠనంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కాగా, రెండో రోజు దర్గా షరీఫ్‌ కు (సందల్‌) గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పించడం జరిగిందన్నారు. దర్గా షరీఫ్‌ లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు వివరించారు. ఈ ఉర్సు ఉత్సవాలకు హైదరాబాద్‌తో పాటు దేశ నలు మూలల నుంచి ఇస్లామిక్‌ స్కాలర్స్‌, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు తెలిపారు.

ఘనంగా పవన్‌కుమార్‌ జన్మదిన వేడుకలు



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నాగోలు: కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌ కుమార్‌ జన్మదినం సందర్భంగా బుధవారం కొత్తపేటలో బీజేపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్‌ మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, పలు డివిజన్ల కార్పొరేటర్లు బీజేపీ నాయకులు పాల్గొని కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



గుంతలమయంగా దిల్‌సుఖ్‌నగర్‌ భవానినగర్‌ రోడ్డు

రోడ్లు ఛిద్రం..

రాకపోకలు జర భద్రం

అభివృద్ధి పేరిట ఇష్టానుసారంగా తవ్వకాలు

పనులు పూర్తయినా పూడ్చని వైనం

మలక్‌పేట: అభివృద్ధి పేరిట అంతర్గత రోడ్లు తవ్వి వదిలేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇరుశాఖల మధ్య సమన్వయంగా కొరవడి అద్దంలా మెరిసే రోడ్లు పైపులైన్‌ నిర్మాణం కోసం అడ్డగోలుగా తవ్వారు. తాగునీరు, డ్రైనేజీ పైపులు బిగించిన తర్వాత రోడ్లు సరిగా పూడ్చకుండా కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో ఇక్కట్లు పడుతున్నామని వాపోతున్నారు. మూసారంబాగ్‌ డివిజన్ల కాలనీలలోని రోడ్ల దుస్థితి ఇందుకు నిదర్శనం.



మూసారంబాగ్‌ అంబర్‌పేట రోడ్డు ఇలా..



ఎస్‌బీఐ ఆఫీసర్స్‌ కాలనీలో..

నెలలు గడుస్తున్నా..

పనులు పూర్తయిన తర్వాత పూడ్చకుండా వదిలేసిన రోడ్లు ఇటీవల కురిసిన వర్షానికి వాహనాల రాకపోకల ధాటికి మరింత అధ్వానంగా మారాయి. దిల్‌సుఖ్‌నగర్‌ భవానినగర్‌ రోడ్డు, శ్రీసాయి డిగ్రీ కాలేజ్‌లైన్‌, మూసారంబాగ్‌ స్వామి వివేకానంద స్కూల్‌లైన్‌, ఎస్‌బీఐ ఆఫీసర్స్‌ కాలనీ, శాలివాహననగర్‌, గడ్డిఅన్నారం తదితర ప్రాంతాలలో రోడ్లు పాడై నెలలు గడుస్తున్న వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతాలలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా వాహనదారులు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా మహాలక్ష్మీ యాగం



మహాలక్ష్మీ యాగంలో పాల్గొన్న దేవానాథ రామానుజ జీయర్‌ స్వామి



లక్ష వత్తుల దీపోత్సవం చేస్తున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ వాసవికాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో కొనసాగుతున్న మహాలక్ష్మీయాగంలో భాగంగా బుధవారం చతుస్థానార్చన, యాగశాలలో యజ్ఞ, అనార్గ్యోయ నివారణ పరిపూర్ణ ఆయురారోగ్యలకు ప్రణవేష్టి (పరమేష్టి) యాజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పంటలు సమృద్ధి కోసం శ్రీలక్ష్మీ నారాయణులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. ప్రధాన యాగశాలలో మహాలక్ష్మీ యాగ నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో శ్రీ భాష్యకారసిద్ధాంతపిఠ వ్యవస్థాప కాచార్యులు శ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌ స్వామి, శ్రీ త్రిదండి శ్రీ అహోబిల రామనుజ జీయర్‌ స్వామి, త్రిదండి శ్రీ దేవానాథ రామానుజ జీయర్‌ స్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ సోమసురేష్‌, ఫౌండర్‌ చైర్మన్‌ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, మాజీ చైర్మన్‌ బంధం దామోదర్‌, ప్రధాన కార్యదర్శి గంప జగన్‌, కోశాధికారి అయిత అంజయ్య, వైస్‌ చైర్మన్‌ నాగమల్లి శ్రవణ్‌కుమార్‌, సెక్రెటరీ దాచేపల్లి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఇస్మాయిల్‌ గురూజీ

వనస్థలిపురం: యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు ఇస్మాయిల్‌ గురూజీ అన్నారు. శ్రీ షిరిడి సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతులు వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో హాల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌ గురూజీ మాట్లాడుతూ.. గుండె జబ్బులు, ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలను ఎదుర్కోవడానికి సాధనా పద్ధతులను నేర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ సంరెడ్డి భుజంగరెడ్డి, వైస్‌ చైర్మన్‌ బాదం జగదీశ్వర్‌, భావన శ్రీనివాస్‌, నరేందర్‌ గురూజీ, మోహన్‌ పాల్గొన్నారు.

హనుమాన్‌ జయంతి రూట్‌మ్యాప్‌ పరిశీలన



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ

నాగోలు: హనుమాన్‌ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన కర్మన్‌ఘాట్‌ హనుమాన్‌ ఆలయం, కొత్తపేట, చంపాపేట్‌, సింగరేణి కాలనీ, సరూర్‌నగర్‌లోని ట్యాంక్‌బండ్‌ పోస్టాఫీస్‌, గాంధీ విగ్రహం, దిల్‌సుఖ్‌నగర్‌, సరస్వతి నగర్‌ ప్రాంతాల్లో హనుమాన్‌ జయంతి ఉత్సవాల రూట్‌ మ్యాప్‌లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. సున్నితమైన ప్రదేశాల్లో ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతియుతంగా ఊరేగింపులు జరిగేలా చూడాలని, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను పోలిసు శాఖ ఉపేక్షించేది లేదని కమిషనర్‌ హెచ్చరించారు. కమిషనర్‌ వెంట ఎల్‌బీనగర్‌ డీసీపీ ప్రవీణ్‌ కుమార్‌, డీసీపీ స్పెషల్‌ బ్రాంచ్‌ నరసింహా రెడ్డి, డీసీపీ ట్రాఫిక్‌–2 శ్రీనివాసులు ఉన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి



స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: డివిజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్‌ పరిధి బాల్‌రెడ్డినగర్‌ కాలనీలో బుధవారం ఆయన పర్యటించగా కాలనీలో నీటి సమస్య తలెత్తిందని, పాడైన పవర్‌బోర్‌ను వెంటనే రిపేర్‌ చేసి బస్తీవాసుల నీటి కష్టాలు తీర్చాలని ఈ సందర్భంగా కాలనీవాసులు కోరారు. బస్తీలోని రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్‌ చేయవద్దని కాలనీవాసులకు సూచించారు. చండీశ్వరీకాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేటర్‌ వెంట భిక్షం, వినోద్‌, జగత్‌కుమార్‌, సత్తయ్య, రమేష్‌, అశోక్‌, వేణు, ప్రభాకర్‌, జంగారెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌, నాగరాజు, లింగస్వామి ఉన్నారు.

కుంట్లూర్‌- జేబీఎస్‌కు బస్సు సర్వీసు ప్రారంభం

నాగోలు: కుంట్లూర్‌ నుంచి జేబీఎస్‌ వరకు వయా పల్లవి ఇంజినీరింగ్‌ కాలేజీ, బండ్లగూడ డిపో, ఆనంద్‌నగర్‌, నాగోలు మీదుగా జేబీఎస్‌ గురువారం నుంచి బస్సు సర్వీస్‌లను ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. కుంట్లూరు నుంచి ప్రతి రోజు ఉదయం 7.50, 10.10, 11, 12.20, 3.35, రాత్రి 08.05, జేబీఎస్‌ నుంచి కుంట్లూర్‌కు ఉదయం 08.55, 11.15, 01.25, 04.40, 07 గంటలకు సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించారు.

17న స్టాల్స్‌ నిర్వహణ బహిరంగ వేలం

చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ కొబ్బరికాయల విక్రేత స్టాల్‌, పూలు, పూజ సామగ్రి, శేషవస్త్రాల సరఫరా, సీసీ కెమెరాల నిర్వహణ, రసీదు పుస్తకాల ప్రింటింగ్‌ వంటి పలు లైసెన్స్‌ హక్కుల కోసం ఈ నెల 17 వరకు సీల్డ్‌ టెండర్లకు అవకాశం ఉంటుందని ఈఓ లావణ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత ధరావతు సొమ్ము చెల్లించి సీల్డ్‌ టెండర్‌లో కానీ బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో స్టాల్స్‌ దక్కించుకున్న వారు ఏడాది పాటు లైసెన్స్‌ హక్కులను పొందుతారని మరిన్ని వివరాలకు 9959701147లో సంప్రదించాలన్నారు.

హనుమాన్‌ జయంతి ఏర్పాట్లపై సమావేశం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌ మారుతిమందిర్‌ కమిటీ బుధవారం హనుమాన్‌ జయంతి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌ ప్రాంతంలో ప్రత్యేకత సంతరించుకున్న హనుమాన్‌ మందిర్‌లో శనివారం హనుమాన్‌ జయంతి వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చిట్టంపల్లి కిరణ్‌కుమార్‌ తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన వసతులు, అంతర్గత సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.టీ సమావేశంలో ఈవో రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బొట్టు శ్రీనివాస్‌, చంద్రయ్య, సంధ్య, నరేందర్‌ పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యం



నాగోలు: ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు సాయినగర్‌ కాలనీ రోడ్డు నెంబర్‌-4లో నివాసముండే ముర్సలీనా (50) భర్తతో విడాకులు తీసుకుని ఇద్దరు కూతుళ్లు అయేషా(19) అబషా(14) కొడుకు బిలాల్‌(17)తో కలిసి ఉంటుంది. ఈ నెల 7న ముర్సలీనా సోదరుడు మహ్మద్‌ ముస్తఫా తన అక్కకు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో ఇంటికెళ్లి చూడగా తాళం వేసి ఉంది. ఇంటి యజమానిని అడగగా ఈ నెల 5న తమ బంధువుల ఇంటికి వెళ్తున్నామని రెండ్రోజుల వస్తామని చెప్పి వెళ్లినట్లు చెప్పారు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేవంత్‌రెడ్డి వైఫల్యంతోనే తాగునీటి సమస్య



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి వైఫల్యంతోనే నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవిలో ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి సమస్య తలెత్తిందని తెలిసి జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆమె ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గడిచిన పదేళ్ల కేసీఆర్‌ హయాంలో మిషన్‌ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నీరు నిరంతరంగా అందిందని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 3 నెలలుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. హైదరాబాద్‌ మహానగరంలో ఏ వీధిలోకి వెళ్లినా తాగునీటి సమస్య తలెత్తుతుందని, ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు మార్పు తీసుకొస్తామన్న ప్రభుత్వం, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి భూములు అమ్మటంపై పెట్టిన శ్రద్ధ, ప్రజా సమస్యలు తీర్చడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మురుకుంట్ల అరవింద్‌ శర్మ, పెండ్యాల నగేష్‌, సాజిద్‌, న్యాలకొండ శ్రీనివాస్‌ రెడ్డి, గొడుగు శ్రీనివాస్‌ ముదిరాజ్‌, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్‌, మహేందర్‌ రెడ్డి, వెంకటేష్‌ గౌడ్‌, కంచర్ల శేఖర్‌, శ్యామ్‌ గుప్తా, వాజిద్‌, జగన్‌, జహీద్‌, రహీం, శ్రీకాంత్‌ గౌడ్‌, కుమార్‌ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్‌: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రిచవచ్చని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌ డివిజన్‌ సూర్యానగర్‌ కాలనీలో కాలనీవాసులు సొంతఖర్చులతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను బుధవారం ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా కాలనీ అవసరాల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎల్‌బీనగర్‌ను నేరరహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ సామ తిరుమల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్‌ నాయకులు, భాస్కర్‌సాగర్‌, కాలనీ అధ్యక్షుడు అనంతుల వెంకటేష్‌గౌడ్‌, నాయకులు జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభలకు తరలిరావాలి..

మన్సూరాబాద్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవ మహా సభలకు ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్దామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ కొప్పుల విఠల్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌ నిర్వహించే రజతోత్సవ సభకు ప్రతి డివిజన్‌ నుంచి కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేక చేతులేత్తేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో జగదీష్‌యాదవ్‌, నాగరాజు, వెంకన్న, అశోక్‌యాదవ్‌, సూరజ్‌యజ్ఞానీ, పారంద నర్సింగ్‌, రాంకోఠి, భాస్కర్‌యాదవ్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హయాంలో విద్యారంగానికి పెద్దపీట



అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న సోహెల్‌ఉద్దీన్‌

మలక్‌పేట: పేద విద్యార్థుల ఉన్నత చదువు కోసం విద్యారంగానికి పెద్దపీట వేసిన ఘనత కాంగ్రెస్‌ పార్టీకే దక్కిందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు మహ్మద్‌ సోహేల్‌ ఉద్దీన్‌ అన్నారు. మలక్‌పేట నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మూసారంబాగ్‌ చౌరస్తాలో నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించారన్నారు. అదే కోవలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి సముచితన స్థానం కల్పించిందన్నారు. విద్యార్థుల సంక్షేమం, వారి సమస్యలను పరిష్కరించడానికి ఎన్‌ఎస్‌యూఐ ఎల్లప్పుడు ముందు వరసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సయ్యద్‌ ఫైసల్‌, అమీర్‌, సోహెల్‌, షాహిద్‌, శ్రవన్‌ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



మలక్‌పేట: నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన దాడుల్లో రూ.6.50 లక్షల విలువ చేసే 12.785 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆర్‌.కిషన్‌ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ నుంచి గంజాయిని నగరానికి తీసుకవస్తున్నారనే సమాచారంతో హైదరాబాద్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీమ్‌ సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌, సిబ్బందితో మూసారంబాగ్‌ పీవీఆర్‌ సినిమా కాంప్లెక్స్‌ మెట్రోస్టేషన్‌ సమీపంలో దాడులు నిర్వహించారు. విశాఖ గాజువాక నుంచి షేక్‌ సాహెబ్‌ఖాన్‌ అనే వ్యక్తి 9.012 కేజీల గంజాయిని తీసుకుని వచ్చి నగరంలో అమ్మకాలు జరుపుతున్న మహమ్మద్‌ అలీకి అందిస్తున్న సమయంలో ఇద్దరిని అరెస్ట్‌ చేసి 9.012 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వా. దీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను మలక్‌పేట ఎక్సైజ్‌ పోలీసులకు అప్పగించారు.

ఆటో డ్రైవర్‌ నిజాయితీ



రాంచందర్‌ను సత్కరించిన పోలీసులు

చాదర్‌ఘాట్‌: ఆటోలో మరిచిపోయిన రెండు ల్యాప్‌టాప్‌లను అప్పగించి తన నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్‌ను పోలీసులు సత్కరించారు. చైతన్యపురికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి జి.శ్రీనివాసరావు విధులు ముగించుకొని ఈ నెల 3న సీతారాంబాగ్‌లో ఆటో ఎక్కాడు. దిగే సమయంలో కార్యాలయానికి చెందిన రెండు ల్యాప్‌టాప్‌లను ఆటోలోనే మరిచిపోయాడు. దిగిన తరువాత గుర్తించిన అతడు చాదర్‌ఘాట్‌ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. తన ఆటోలో ల్యాప్‌టాప్‌లను గుర్తించిన ఉప్పల్‌కు చెందిన రాంచందర్‌ వాటిని మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. చాదర్‌ఘాట్‌, మహంకాళి పోలీసుల సమన్వయంతో బుధవారం ల్యాప్‌టాప్‌లను శ్రీనివాసరావుకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న రాంచందర్‌కు పోలీసులు రూ. వెయ్యి నగదు అందజేసి సత్కరించారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసు

హస్తినాపురం: భూవివాదంలో పరస్పర దాడులకు పాల్పడగా ఇరువర్గాలపై కేసు నమోదైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌ గ్రామంలోని సర్వే నంబర్లు 240, 241, 242 లోని 60.20 ఎకరాల భూమిలో గుండ్ల రాజమ్మ,చిన్న మల్లయ్య రెండు గ్రూపులుగా ఏర్పడి బుధవారం ఉదయం నుంచి వివాదస్పద భూమిలో పనులు చేసేందుకు వెళ్లి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడగా పోలీసులు సముదాయించి నచ్చజెప్పారు.అయినా వినకపోవడంతో బుధవారం రాత్రి ఇరువర్గాలపై కేసు నమోదు చేసి ఆర్‌డీవోకు లేఖ రాశారు. స్పందించిన ఆర్‌డీవో ఆ భూమిలోకి ఎవరు వెళ్లకుండా 145 సెక్షన్‌ నమోదు చేశారు.